సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ၊ 24 ၊ ఆగస్టు ၊ 2024



15,648 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 15,648 క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయం శుక్రవారానికి 29.064 టీఎంసీలకు చేరుకుంది. కండలేరుకు 2 వేలు, దిగువకు 560 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,667
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,867
నవర (8 గ్రాములు)	రూ.54,936

గరిష్టం/కనిష్టం
37.3 /29.0

వాతావరణం

గాలిలో తేమ 69 శాతంగా శుక్రవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శనివారం మబ్బులు చేసి ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

మహిళా డాక్టర్లకు రక్షణ లేదు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లకు, నర్సులకు రక్షణ లేకుండా పోయింది. రాత్రి పూట భయంతో విధులు నిర్వర్తిస్తున్నాం. ఎప్పుడు, ఏ మూల నుంచి సమస్య వస్తుందో అర్థం కావడం లేదు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించి రోగులతో పాటు ఆస్పత్రులకు వస్తున్నారు. ప్రభుత్వం తగిన రక్షణ కల్పించకపోవడంతో మహిళలపై కోల్‌కతా వంటి అమానుష ఘటనలు జరుగుతాయని భయపడుతున్నాం. – డాక్టర్ హంసలేఖ, జీజీహెచ్

రెస్ట్ రూమ్ అవసరం



కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం నేపథ్యంలో మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్షణ కల్పించాలి. రాత్రి పూట విధులు నిర్వర్తించే డాక్టర్ల వద్ద తగిన సెక్యూరిటీ పెంచాలి. ప్రతి వార్డులో వైద్యులకు ప్రత్యేక రెస్ట్ రూం, వాష్ రూంలను ఏర్పాటు చేయాలి. తగినంత మంది ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలను నియమిస్తే చాలా వరకు సమస్యలు తగ్గుతాయి. డాక్టర్లపై చేయి వేసినా, వంకరగా మాట్లాడినా తక్షణమే కఠినంగా శిక్షించాలి. – డాక్టర్ జునైద్ అలీ అహ్మద్, జూడాల అసోసియేషన్ అధ్యక్షుడు

తప్పు చేయాలంటే భయపడాలి



మహిళా డాక్టర్లు, నర్సులు, ఉద్యోగం చేస్తున్న మహిళలు, ఇతర కూలీ పని చేసుకునే బాలికలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరగకుండా కేంద్రం కఠిన చట్టాలు తెచ్చి, ఎవరైనా తప్పు చేయాలంటే భయపడేలా శిక్షించాలి. నర్సింగ్ సిబ్బంది, మహిళా డాక్టర్లు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేలా వైద్యశాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలతో కూడిన అధికారులతో ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలి. విధులు నిర్వర్తించే చోట రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. – వరలక్ష్మి, సీనియర్ స్టాఫ్ నర్సు, జీజీహెచ్

న్యూస్‌రీల్

వెంకయ్యస్వామికి సింహవాహనోత్సవం



వెంకటాచలం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గొలగమూడి వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి సింహవాహనోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో నిత్య పూజలు అనంతరం వెంకయ్యస్వామి వారు సింహవాహనరూఢుడై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవానికి బయలుదేరారు. స్వామి ముందు ఆశ్రమ భజన బృందం కోలాట ప్రదర్శన చేశారు. భక్తులు ఓం నారాయణ.. ఆదినారాయణ అంటూ వెంకయ్యస్వామి భక్తిగీతాలను ఆలపించారు. సింహవాహన సేవకు వేమూరు కిషోర్‌కుమార్, నాగవెంకట అరుణలత, వెంకటసాయి సాత్విక్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కనుల పండగగా గరుడ వాహన సేవ

శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన స్వామివారు గొలగమూడి వీధుల్లో కనుల పండువగా ఊరేగారు. నెల్లూరుకు చెందిన బీవీ లక్ష్మి, హేమంత్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్సవాలను ఆశ్రమ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

నేడు ఆరాధనోత్సవం

భగవాన్ వెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉదయం 9 గంటలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. 10 గంటలకు రథోత్సవం జరగనుంది. రాత్రి 8 గంటలకు కోనేరులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఆరాధనోత్సవాల్లో చివరిరోజు భక్తులు వేలాది సంఖ్యలో హాజరుకానుండడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

మెప్మా ఆర్‌పీల ఆందోళన

కందుకూరు: ఎన్నికల సమయంలో అన్యాయంగా తమను విధుల నుంచి తొలగించారని, తిరిగి ఇంత వరకు విధుల్లోకి తీసుకో లేదంటూ మెప్మా విభాగంలో పనిచేసిన ఆర్‌పీలు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే కారణంతో మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న 18 మంది ఆర్‌పీలను అప్పట్లో అధికారులు విధుల నుంచి తప్పించారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరిలో ఓ ముగ్గురిని మాత్రమే విధుల్లోకి తీసుకున్నారు. మిగిలిన వారిని విధుల్లోకి తీసుకోకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. ప్రస్తుతం రాజకీయ కారణాలతో తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటర్ ఐడీ కార్డుల దహనం



సగం వరకు కాలిపోయిన ఓటరు ఐడీ కార్డులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఓటర్లకు చేర్చాల్సిన ఓటరు గుర్తింపు కార్డులు పెద్ద సంఖ్యలో గుట్టగా పోసి కాల్చేసిన ఘటన మండలంలోని పెనుబల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుడు మాధవ్ తెలిపిన సమాచారం మేరకు.. ఎన్నికల సమయంలో ప్రజలకు అందాల్సిన ఓటర్ ఐడీ కార్డులను పంపిణీ చేయకుండా పక్కన పడేశారు. అటువంటి కార్డులను గ్రామంలోని పాడుబడిన సామాజిక వికాస భవనం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టినట్లు గుర్తించామన్నారు. ఎన్నికల సమయంలో బీఎల్వోలు అలసత్వం వల్లే ఓటర్ ఐడీ కార్డులను ప్రజలకు అందజేయలేదని విమర్శించారు. ఓటర్ కార్డులను పంపిణీ చేయకుండా దహనం చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. శుక్రవారం జరిగిన గ్రామసభలో అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాల రైతుకు ధరాఘాతం



పాడిరైతుపై కూటమి పిడుగు పడింది. మొన్నా మొన్నటి వరకు పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తే.. కూటమి ప్రభుత్వం రావడంతో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. గత ప్రభుత్వం పాడి రైతులకు మేలు చేకూర్చాలని అంతర్జాతీయంగా ప్రఖ్యాతగాంచిన సహకార రంగంలోని అమూల్ డెయిరీతో ఒప్పందం చేసుకుని పాల సేకరణకు శ్రీకారం చుట్టింది. ఈ పరిణామంతో ప్రైవేట్ డెయిరీలు పాల ధరలను అమాంతంగా పెంచాయి. ఇదే సమయంలో పాలసేకరణకు ప్రైవేట్ డెయిరీలు పాడి రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తూ పోటీ పడ్డాయి. పాడి రైతులు ఇప్పుడిప్పుడే కుదురుకుంటున్న సమయంలో కొత్త ప్రభుత్వం అమూల్‌తో ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన వెంటనే పాలకు ధరాఘాతం ఏర్పడింది.





- ఈయన పేరు ఎం.బ్రహ్మయ్య, రాళ్లపాడు గ్రామం, లింగసముద్రం మండలం. అతనికి నాలుగు గేదెలు ఉన్నాయి. గత ప్రభుత్వం పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అమూల్‌తో ఒప్పందం చేసుకోవడంతో ఈ ప్రాంతంలో అమూల్ పాల సేకరణ లేకపోయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందేమో అని ప్రైవేట్ డెయిరీలు పాల ధరను పెంచాయి. వెన్న 10 శాతం వస్తే లీటరుకు రూ.82 వరకు ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో లీటరుకు రూ.72 మాత్రమే ఇస్తున్నారని బ్రహ్మయ్య చెబుతున్నాడు. ఈ ప్రభుత్వం అమూల్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో అమాంతంగా లీటరుకు రూ.10 తగ్గించారని బ్రహ్మయ్య వాపోయాడు.



- ఇతని పేరు సీహెచ్ రమేష్, పొదలకూరు మండలం నావూరుపల్లి. ప్రస్తుతం ఒకే గేదెను మేపుకొంటూ రోజుకు రెండు లీటర్ల పాలను నచ్చిన డెయిరీకి విక్రయిస్తున్నాడు. గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో హెరిటేజ్ డెయిరీ లీటరుకు రూ.80 వరకు ఇచ్చేవారు. మార్చి నుంచి రూ.5 తగ్గించి రూ.75 అందజేస్తున్నారని రమేష్ చెబుతున్నాడు. ప్రభుత్వం మారడం, అమూల్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో లీటరుకు (వెన్న శాతాన్ని బట్టి) రూ.60 నుంచి రూ.70 వరకు తగ్గించారని పేర్కొన్నాడు. మార్కెట్లో వెన్న తీసిన పాల ధరకు రైతులు పోసే పాల ధరలకు చాలా వ్యత్యాసం ఉందని, ప్రైవేట్ డెయిరీల మధ్య పోటీ ఉండడంతో ఆ మాత్రమైనా ధరలు అందజేస్తున్నట్లు చెబుతున్నాడు.

పాడి రైతుపై హెరిటేజ్ పిడుగు

- అమూల్ ఒప్పందంతో దిగొచ్చిన ప్రైవేట్ డెయిరీలు
- గత ప్రభుత్వంలో లభించిన గిట్టుబాటు ధరలు
- కూటమి ప్రభుత్వం రావడంతో దిగజారుతున్న రేటు
- నెల రోజుల్లో లీటరుపై రూ.5 నుంచి రూ.10 వరకు తగ్గుదల
- పెరగాల్సిన ధరలు పతనం
- తగ్గిన పాల సేకరణ



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమదే అగ్రస్థానం. రోజుకు దాదాపు 3 లక్షల లీటర్లకు పైగా పాల ఉత్పత్తి జరుగుతోంది. ప్రభుత్వ రంగంలోని విజయ డెయిరీతో పాటు దొడ్ల, తిరుమల, హెరిటేజ్, సంగం, జెర్సీ వంటి ప్రైవేట్ డెయిరీలు కూడా పాల సేకరణ చేస్తున్నాయి. ఉదయగిరి, ఆత్మకూరు కావలి, కోవూరు వంటి ప్రాంతాల్లో పాడి పరిశ్రమే ప్రధాన జీవనాధారం. ఐదేళ్ల క్రితం వరకు కూడా జిల్లాలో పాల ధరలు పాతాళంలో ఉండేవి. గతంలో ప్రభుత్వ పెద్దలకు చెందిన ప్రైవేట్ డెయిరీ ఆధిపత్యంతో లీటరుకు రూ.40.. రూ.50 కూడా లభించేది కాదు. మార్కెట్లో మాత్రం వెన్న తీసేసిన పాల విక్రయ ధరలు మాత్రం కొనేదానికంటే డబుల్ ఉండేది. పాడి రైతులు ప్రైవేట్ డెయిరీల దోపిడీకి నష్టపోతున్న పరిస్థితి ఉండేది. ఇక ప్రభుత్వ రంగంలోని విజయ డెయిరీని సైతం నిర్వీర్యం అయింది. ప్రభుత్వ పెద్దల అజమాయిషీలో నడవాల్సి ఉండడంతో పాడి రైతులకు మేలు చేయాలని ఉన్నా.. చేయలేని నిస్సహాయతలో విజయ డెయిరీ ఉండిపోయింది. ప్రభుత్వ పెద్దల ప్రైవేట్ డెయిరీ అడుగుజాడల్లోనే మిగతా ప్రైవేట్ డెయిరీలు నడుచుకుంటూ వచ్చాయి.

అమూల్‌తో ఒప్పందంతో..

గత ప్రభుత్వం పాడి రైతులకు ఆర్థికాభివృద్ధి కల్పించాలని సంకల్పించింది. మార్కెట్‌లోకి అంతర్జాతీయంగా పాల ఉత్పత్తుల తయారీ, అమ్మకాల్లో పోటీ పడే, అత్యధిక ఆదరణ కలిగిన అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తొలి, మలి దశల్లో అమూల్ పాల సేకరణ కేంద్రాలు ప్రారంభించింది. దీంతో ప్రైవేట్ డెయిరీల మధ్య పోటీ పెరగడంతో పాల ధరలు వెన్న శాతాన్ని బట్టి పెంచేశాయి. జిల్లాలో అమూల్ సంస్థ పాల సేకరణ కేంద్రాలు ప్రారంభించకపోయినప్పటికీ పాల సేకరణ ధరలు నిలకడగానే ఉంటూ వచ్చాయి. తక్కువలో తక్కువగా 5.0 వెన్న శాతం ఉన్నా.. రూ.44 ధర లభిస్తోంది. ఇక 10.0 వెన్న శాతం ఉంటే రూ.80 ధర కల్పించాయి. కూటమి ప్రభుత్వ పెద్దల ప్రైవేట్ డెయిరీకి మేలు చేకూర్చేందుకు అమూల్‌తో జరిగిన ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో సదరు ప్రైవేట్ డెయిరీతో పాటు మిగతా డెయిరీలో కూడా ధరలు అమాంతంగా తగ్గించాయి. ప్రస్తుతం లీటరుకు కనీస వెన్న శాతం 5.0 ఎస్ఎన్ఎఫ్ ఉంటే రూ.40 కంటే తక్కువగా ఉంటే.. 10.0 ఎస్ఎన్ఎఫ్ ఉండే పాలకు రూ.73 నుంచి రూ.75లకు తగ్గించాయి. ఒక్కసారిగా రేటు తగ్గించడంతో పాడి రైతుల ఆర్థికంగా చితికిపోతున్నారు.

జిల్లాలో 368 బీఎంసీలు ఏర్పాటు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడి రైతులకు శాశ్వత ప్రయోజనం దక్కేలా సహకార రంగ డెయిరీ అయిన అమూల్‌తో కలిసి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించింది. పశుసంవర్ధక శాఖ, డీఆర్‌డీఏ సంయుక్త భాగస్వామ్యంతో మహిళలకు ఆర్థిక ఉన్నతికి కల్పించేందుకు జిల్లాలో 311 ఏఎంసీ (ఏజెంట్ మిల్క్ కలెక్షన్) సెంటర్ల పరిధిలో 368 బల్క్ మిల్క్ కూలింగ్ (బీఎంసీలు) ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఆర్‌బీకే పరిధిలో అమూల్ బల్క్ మిల్క్ యూనిట్లలో 2 వేల లీటర్ల కెపాసిటీ కంటైనర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏఎంసీల ద్వారా సేకరించిన పాలను బీఎంసీలకు తరలించి అక్కడ స్టోర్ చేసేలా ఏర్పా టు చేశారు. ఈ ప్రణాళిక పూర్తిస్థాయిలో అమలు జరిగే లోపు ప్రభుత్వం మార్పుతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి గత ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా గేదెల కొనుగోలుకు ఆర్థిక సాయం అందించింది. వైఎస్సార్ చేయూత ద్వారా ప్రతి ఏటా రూ.18,750 ఆర్థిక సాయం అందించింది. యూనిట్ విలువ రూ.75 వేలు కావడంతో మిగిలిన నగదు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించింది. ఏటా ప్రభుత్వం అందించే సాయంతో బ్యాంకులకు రుణాన్ని తిరిగి చెల్లించే విధంగా అమలైంది.

పాలసేకరణ ధర తగ్గించేశారు



పాల సేకరణ ధర బాగా తగ్గించేశారు. విజయ డెయిరీ లీటరు పాలకు రూ.80 ఇస్తుండేది. ఇప్పుడు రూ.74 తగ్గించారు. ఇక ప్రైవేట్ డెయిరీలు అయితే ఇంకా రెండు.. మూడు రూపాయలు తక్కువగానే ఉన్నాయి. పశువుల దాణా, ఇతర ఖర్చులు బాగా పెరిగాయి. పాల సేకరణ ధరలు తగ్గిస్తే రైతు బతికేదెట్ల. పాడిపై ఆదాయాలు పెద్దగా లేవు. వేరే ఉపాధి పనులు లేకపోవడంతో గత్యంతరం లేక పశుపోషణతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. – రమేష్, అల్లూరు

పశుపోషణ భారం

పశుపోషణ వ్యయానికి పాలకు వస్తున్న ధరలకు గిట్టుబాటు లభించడం లేదు. ప్రైవేటు డెయిరీలు ఒకరిని చూసి ఒకరు కుమ్మక్కై ధరలు తగ్గించాయి. పశుపోషణలో కీలకమైన ఎండు గడ్డి ధర బాగా పెరిగిపోయింది. గతంలో ఒక మోపు గడ్డి రూ.80–రూ.100 వరకు ఉంటే ప్రస్తుతం రూ.120లకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గేదెలకు ఎండు గడ్డి వేయకపోతే వెన్న శాతం పెరగదు. దీని వల్ల గేదెలకు ఎండు గడ్డి కచ్చితంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఖర్చులు పెరిగే కొద్దీ పాల ధర పెరగాల్సింది పోయి ధర తగ్గిస్తుంటే పాడి గేదెలను పోషించడం కష్టమవుతుంది. దాణా ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. తవుడు కూడా కేజీ రూ.40లకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. పాడి రైతులకు గిట్టుబాటు కల్పించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పశు పోషకులను పట్టించుకుని గిట్టుబాటు ధర కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని పాడి రైతులు అంటున్నారు.

గతంలో..



ప్రైవేట్ డెయిరీలు

ఎస్ఎన్ఎఫ్	లీటరు ధర
5.0	రూ.44.00
6.0	రూ.50.80
7.0	రూ. 57.60
8.0	రూ.64.40
9.0	రూ.71.20
10.0	రూ.80.00

ప్రస్తుతం

ఎస్ఎన్ఎఫ్	లీటరు ధర
విజయ డెయిరీ	
7.0	రూ.51.73
8.0	రూ.59.12
10.0	రూ.74.00
సంగం డెయిరీ	
7.0	రూ.54.60
8.0	రూ.62.40
10.0	రూ.75.00
జెర్సీ డెయిరీ	
7.0	రూ.54.60
8.0	రూ.64.00
10.0	రూ.75.00
హెరిటేజ్ డెయిరీ	
7.0	రూ.50.00
8.0	రూ.58.00
10.0	రూ.73.00

సమస్యల సత్వర పరిష్కారానికే గ్రామసభలు

- కలెక్టర్ ఆనంద్



నువ్వూరుపాడులో ఉపాధి హామీ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఆత్మకూరురూరల్: జిల్లాలో ఒకే రోజు 722 గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గ్రామ సభలు నిర్వహించామని, ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉపాధిహామీ గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం ఉంటే ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తుందన్నారు. గ్రామస్తుల వ్యక్తిగత అవసరాలు, గ్రామ అవసరాలు, ఉపాధి హామీ పనుల అమలు, తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నామన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, అంతర్గతరోడ్లు, గ్రామాలు, పట్టణాల మధ్య అనుసంధాన రోడ్లు, వ్యర్థాల నియంత్రణ, నీళ్ల ట్యాంకుల ఏర్పాటు తదితర కనీస అవసరాలు తీర్చేందుకు గ్రామసభల్లో చర్చించి తీర్మానాలు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ప్రతినిత్యం 50 వేల నుంచి 60 వేల మందికి పనులు కల్పిస్తున్నామన్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వ్యవసాయ పనులు లేనందున పేదలకు ఉపాధి పనులు అవసరమన్నారు. ఎండ వేడిమి కారణంగా కూలీలు ఉదయం 5, 6 గంటల మధ్యలో పనులకు వచ్చి 11 గంటల్లోగా పనులు ముగించుకొని వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో ఎంత ఎక్కువగా ఉపాధి పనులు జరిగితే మెటీరియల్ కాంపోనెంట్, వేజ్ ఎంప్లామెంట్ ద్వారా ఆయా గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు నిర్మించుకునేందుకు నిధులు అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామసభ ప్రారంభానికి ముందు స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆనంద్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

గ్రామస్తులతో కలెక్టర్ ముఖాముఖి

నువ్వూరుపాడు ఉపాధి హామీ గ్రామసభలో కలెక్టర్ ఓ ఆనంద్ గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని నువ్వూరుపాడు, అశ్వనీపురం, జంగాలపల్లి, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు సంబంధించిన మహిళలు, పురుషులు తమ సమస్యలను ఏకరువు పెట్టగా, ఆయా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న నిధులు కేటాయించడంతో పాటు రెవెన్యూ సంబంధమైన అంశాలు నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉపాధిహామీ గ్రామ సభలో ప్రజలు అధికంగా రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ కేవలం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మాత్రమే ఉద్దేశించి సెప్టెంబర్ 1,2 తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సదస్సుల్లో పాల్గొని సమస్యలను తెలిపి పరిష్కరించుకోవచ్చునన్నారు. జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఇన్‌చార్జి ఆర్డీఓ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దారు సునీల్, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచ్ కటారి దొరసానమ్మ, ఎంపీటీసీ గడ్డం సుచిత్ర, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకేశ్ వద్దకు 'కొలగాని' బాధితులు

- బాధితులను పలకరించేందుకు నిరాకరించిన మంత్రి ఆనం
- ఈ విషయంలో తలదూర్చవద్దంటూ స్థానిక టీడీపీ నేతలకు వార్నింగ్

ఆత్మకూరు: పట్టణ నడిబొడ్డున కొలగాని రామయ్యసత్రం పంచాయితీ మంత్రి లోకేశ్ వద్దకు చేరనుంది. సత్రానికి సంబంధించి సర్వే నంబర్ 1965/ఎ స్థలంలో ఏడు దశాబ్దాలకుపైగా నివశిస్తున్న పేదలను, రోడ్డు పక్కన వ్యాపార గదులు నిర్మించుకున్న పలువురిని వెంటనే ఖాళీ చేయాలంటూ దేవదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయమై అక్కడి నివాసితులు కొందరు స్థానిక టీడీపీ నేతలతో కలిసి గురువారం రాత్రి నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. అయితే బాధితులను కలిసి మాట్లాడేందుకు ఇష్టపడని మంత్రి ఆనం కేవలం స్థానిక టీడీపీ నేతలు ఇద్దరిని లోపలికి పిలిపించుకుని మాట్లాడారు. మీ పనులు మీరు చూసుకోవాలని, అనవసరంగా కొలగాని రామయ్య సత్రం విషయంలో వకాల్తా పుచ్చుకుని మరోసారి రావొద్దని తీవ్రంగా హెచ్చరిస్తూ రుసరుసలాడారని సమాచారం. ఆయనతో మాట్లాడి వెలుపలికి వచ్చిన టీడీపీ నాయకులు బాధిత కుటుంబాల వారిని సర్దుబాటు ధోరణిలో అనునయించారు. ఈ విషయమై న్యాయం జరగాలంటే మంత్రి లోకేశ్‌ను కలుద్దామని నిర్ణయించారు. సోమ, మంగళవారాల్లో మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు అవకాశం లభించినట్లు సమాచారం.

జూడాల సమ్మె విరమణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధరాదేవి

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో జూనియర్ డాక్టర్లు ఎట్టకేలకు శుక్రవారం సమ్మె విరమించారు. కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, పనిచేసే చోట డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు ఈనెల 15 నుంచి నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, సర్వజన ఆస్పత్రిలో తమ విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు. సుప్రీంకోర్టు తీసుకున్న చర్యలతో పాటు, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సమ్మెను ప్రస్తుతానికి విరమిస్తున్నామని జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధరాదేవి సమ్మెను విరమింప చేశారు. ఆమె మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలన్నింటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రక్షణ గురించి పోలీసులతో చర్చించామన్నారు. జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జునైద్ అలీఅహ్మద్, పేరస్ జోయల్ మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీలను రెండు వారాల్లో అమలు చేయాలని కోరారు. లేకపోతే మళ్లీ పోరుబాట పడుతామన్నారు. తమ పోరాటానికి మద్దతు ఇచ్చిన ప్రజాసంఘాలకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. జూడాలకు మద్దతుగా ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, డాక్టర్ చంద్రశేఖర్‌నాయుడు, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మునీర్‌ఖన్నా, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ కాలేషాబాషా తదితరులు పాల్గొన్నారు.

29న జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

నెల్లూరు (దర్గామిట్ట): జెడ్పీలోని 7 స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, స్త్రీ,శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ విషయాలపై స్థాయి సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పథకం, రహదారులు, భవనాల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గృహ నిర్మాణశాఖ, విద్యుత్‌శాఖ, జిల్లా పశుసంవర్థక శాఖ, జిల్లా మత్స్యశాఖ, జిల్లా ఉద్యానశాఖ, సమగ్ర శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ, సమీకృత గిరిజన అభివృద్ధి శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఆయా స్థాయీ సంఘాల చైర్మన్లు, సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని సీఈఓ ఆ ప్రకటనలో సూచించారు.



ఆడ బిడ్డను కాపాడుకోవడం అందరి బాధ్యత

ఆడ బిడ్డను కాపాడుకోవడం అందరి బాధ్యత. ఆడైనా.. మగైనా సమానమేననే భావనను చిన్నతనం నుంచే తల్లిదండ్రులు కల్పించాలి. నైతిక విలువలను నేర్పాలి. తప్పు చేసిన వారిపై ప్రభుత్వాలు అత్యంత కఠినంగా వ్యవహరించాలి. మహిళలను కించపర్చినా, వేధింపులకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వాలు నూతన చట్టాలు తేవాలి. ఈ కారణంగానే జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మెకు మద్దతిచ్చాం. – మస్తాన్‌బాషా, ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ విభాగం



న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం

కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం అత్యంత బాధాకరం. ప్రాణం పోసే డాక్టర్లపై దాడులు జరగడం దారుణం. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా టాస్క్‌ఫోర్స్ కమిటీని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది. డాక్టర్లు, నర్సుల రక్షణ కోసం పూర్తి స్థాయి చర్యలు చేపట్టనున్నాం. సుప్రీం కోర్టు జోక్యంతో న్యాయం జరుగుతుందని భావిస్తున్నాం. – వసుంధరాదేవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, నెల్లూరు



దాడులు చేసేవారి కోరలు పీకాలి

రోగులకు ప్రాణం పోస్తున్న డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిపై దాడులు చేస్తున్నారు. ఇది దారుణం. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలి. దాడులు, కించపర్చేలా మాట్లాడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. వీరి కోరలు పీకేలా శిక్షించాలి. ఆడ బిడ్డలకు రక్షణ కల్పించాలి. – సునీత, సీనియర్ నర్సు, రామచంద్రారెడ్డి ఆస్పత్రి



జామాయిల్ డిమాండ్ జూమ్

జిల్లాలో కర్రకు పెరిగిన పోటీ

- సాగు లేక ప్రస్తుతం తగ్గిన లభ్యత
- రోజుకు 7500 టన్నులు అవసరం కాగా, వెయ్యి సైతం లభించని వైనం
- రూ.ఏడు వేల వరకు పలుకుతున్న టన్ను ధర



జామాయిల్ తోట

కందుకూరు: జిల్లాలో జామాయిల్ కర్రకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. కొంతకాలంగా జామాయిల్ సాగు భారీ స్థాయిలో తగ్గిపోవడం.. ఇదే సమయంలో ప్లయ్‌ఉడ్, పేపర్ కంపెనీలు పెరగడంతో వీరి మధ్య పోటీతో అనూహ్య డిమాండ్ వచ్చిపడింది. కంపెనీల అవసరాలకు అనుగుణంగా లభ్యత లేకపోవడంతో టన్ను కర్ర ధర అమాంతం పెరిగిపోయింది. టన్నుకు రూ.ఆరు వేల నుంచి రూ.ఏడు వేల వరకు చెల్లించేందుకు సైతం కంపెనీలు వెనుకాడటం లేదు.

పెద్ద ఎత్తున అవసరం

వాస్తవానికి రెండేళ్ల వరకు జామాయిల్ కర్రకు సరైన ధరల్లేక రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టన్ను ధర రూ.1800 నుంచి రూ.రెండు వేల వరకే పలికేది. ఖర్చులు సైతం రాకపోవడంతో పలువురు రైతులు సాగును పూర్తిగా మానుకున్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో ప్లయ్‌ఉడ్ తయారీ కంపెనీలు ఏర్పాటయ్యాయి. దీంతో ఈ కంపెనీల అవసరాలకు పెద్ద ఎత్తున కర్ర అవసరమైంది. అయితే జామాయిల్ సాగు దీర్ఘకాలం కావడం.. కొంత కాలంగా సాగు తగ్గడంతో నిల్వల్లేకుండా పోయాయి. దీంతో ప్రస్తుతం ఊహించని స్థాయిలో డిమాండ్ ఏర్పడింది.

లభ్యత స్వల్పంగా..

ప్రస్తుత డిమాండ్ నేపథ్యంలో జిల్లా నుంచే రోజుకు 7,500 టన్నుల కర్ర కంపెనీలకు అవసరమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతం రోజుకు వెయ్యి టన్నులు కూడా లేదని తెలుపుతున్నాయి. మరోవైపు రాష్ట్రం మొత్తమ్మీద నాణ్యమైన కర్ర నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనే సాగవుతుంది. దీంతో ఇక్కడి నుంచి వచ్చే కర్ర కోసం ఐటీసీ వంటి కార్పొరేట్ కంపెనీలు విపరీతంగా పోటీపడతాయి. దీంతో కంపెనీల మధ్య డిమాండ్ ఏర్పడింది.

అటవీ శాఖ నుంచి భారీగా కొనుగోలు

జిల్లాలో అటవీ శాఖ పరిధిలో సాగులో ఉన్న కర్రను ఏడాది కాలంలో కంపెనీలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి. ఇలా దాదాపు ఆరు లక్షల టన్నుల కర్రను కొనుగోలు చేశాయని తెలుస్తోంది. కందుకూరు మండలం పలుకూరు, ఏఎస్‌పేట మండలం హసనాపురం వద్ద బఫర్ స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి కర్రను ఐటీసీ కంపెనీ నిల్వ చేసుకుంది. మార్కెట్ ఫీజు రూపంలో కందుకూరు ఏఎమ్సీకి రూ.ఐదు లక్షలు, ఆత్మకూరు ఏఎమ్సీకి రూ.16 లక్షల వరకు చెల్లించారని అధికారులు చెప్తున్నారు. టన్ను కర్రను ఏకంగా రూ.ఆరు వేల వరకు కొనుగోలు చేశారు. అటవీ శాఖ పరిధిలోని కర్ర దాదాపు ఐదు నుంచి ఏడేళ్ల వయస్సు కలిగింది కావడం, సైజు ఆశించిన రీతిలో ఉండటంతో ఇంత భారీ రేటును పెట్టి కొనుగోలు చేశాయి. వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో సాగులో ఉన్న 1.5 లక్షల టన్నుల కర్రనూ కొనుగోలు చేశారు. ఇంత భారీ మొత్తంలో కర్రను వేలంలో దక్కించుకున్నా, కంపెనీల అవసరాలకు సరిపడా రావడం లేదని చెప్తున్నారు. మరో ఏడాది వరకు కర్రకు డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు.

టన్ను ధర పైపైకి..

టన్ను జామాయిల్ కర్రకు మద్దతు ధర రూ.4400గా ఉంది. ఇందులో కర్ర కటింగ్‌తో పాటు తాటతీసే ఖర్చునూ రైతులే భరించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం కటింగ్, తాటతీసే ఖర్చుతో సంబంధం లేకుండా కర్ర సైజును బట్టి టన్నుకు రూ.ఐదారు వేల వరకు కంపెనీలు చెల్లిస్తున్నాయి. నాణ్యమైన కర్ర ఉంటే టన్నుకు రూ.7500 కూడా ఇచ్చేందుకు సైతం వెనుకాడటం లేదని మార్కెటింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే జిల్లాలో లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడం గమనార్హం.

అధిక రాబడి ఆశతో భారీగా పెట్టుబడులు

- ప్రజల నుంచి రూ.కోట్లలో వసూలు చేస్తున్న షేర్‌మార్కెట్ వాలా

కావలి: డబ్బుపై అందరికీ ఆశ ఉండటం సహజం. సునాయసంగా అధిక రాబడి వస్తుందంటే ఆ మార్గంలో ఎక్కువమంది వెళ్లడం మామూలే. ఇలా ప్రజల బలహీనతలనే పెట్టుబడిగా చేసుకొని కోట్లు ఆర్జించే వ్యక్తుల వలలో పడి ఆర్థికంగా సర్వస్వం కోల్పోయిన వారు కోకొల్లలుగా ఉంటుంటారు. తాజాగా కావలి పట్టణంలోని ముసునూరు ప్రాంతంలో ఇలాంటి తంతే ఒకటి వెలుగులోకి వచ్చింది. గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి మూడేళ్ల క్రితం కావలి పట్టణానికి వచ్చారు. టాటా, బిర్లా, రిలయన్స్ వంటి వ్యాపార సంస్థల్లో పెట్టుబడి పెట్టి లాభాలను ఆర్జించే షేర్ మార్కెట్లో తాను నిష్ణాతుడినని స్థానికులను నమ్మించారు. షేర్ మార్కెట్లో ఎలా పెట్టుబడి పెట్టాలి, లాభాలు ఎలా వస్తాయో ట్రైనింగ్ ఇస్తానని చెప్పసాగారు. అలా స్థానికులను నమ్మించి షేర్ మార్కెట్లో పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అప్పుగా డబ్బులు తీసుకున్నట్లు ప్రామిసరీ నోట్లు రాసిస్తున్నారు. ప్రతి రూ.లక్షకు నెలకు రూ.ఆరు వేలు, రూ.ఏడు వేలు, రూ.ఎనిమిది వేలు.. ఇలా మూడు కేటగిరీలుగా ఆదాయం పేరుతో ఇస్తుంటారు. మీ డబ్బును షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టానని, మీ డబ్బుకు ష్యూరిటీ కోసం నేను ప్రామిసరీ నోట్లు రాసిస్తున్నానని, ప్రతి నెలా షేర్ మార్కెట్ ద్వారా వచ్చిన ఆదాయాల్లో కొంత నేను తీసుకొని, కొంత మీకు ఇస్తున్నానని నమ్మకం కలిగిస్తున్నారు. దీంతో కావలి పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారు సైతం అతనిపై నమ్మకంతో డబ్బులిస్తున్నారు. కూలీలు, ప్రభుత్వోద్యోగులు, వివిధ వృత్తులు చేసుకునేవారు.. ఇలా వివిధ వర్గాల వ్యక్తులు షేర్ మార్కెట్ వాలాకు రూ.లక్షలను అప్పగిస్తున్నారు. అయితే నిర్వాహకుడి వ్యవహారంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడితే ప్రామిసరీ నోట్లు ఎందుకు రాసిస్తున్నారు.. షేర్ మార్కెట్ అనేది రోజూ పెరగుతూ.. తగ్గుతూ ఉంటుంది ఈ క్రమంలో ప్రతి నెలా ఆదాయం కచ్చితంగా ఇంత వచ్చిందని చెప్పలేని విధంగా ఉంటుంది. అలాంటప్పుడు ఇతను ప్రతి నెలా క్రమం తప్పకుండా డబ్బులు ఎలా ఇవ్వగలుగుతున్నారు..? ఈ వ్యవహారంపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టి వాస్తవాలను వెలికితీస్తే బాగుంటుందని.. ప్రజలకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి టీ – 20 తాటిపర్తి సునీల్‌కుమార్ స్మారక ఇన్విటేషన్ వెటరన్ క్రికెట్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రికెట్ మైదానంలో వివిధ జట్లు తలపడ్డాయని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు, కడప జట్లు తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 150 పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి దిగిన గుంటూరు జట్టు 14.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.
- మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో విజయవాడ, హైదరాబాద్ జట్లు పోటీ పడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయవాడ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 185 పరుగులు సాధించింది. జట్టులోని లెనిన్ 53 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 17.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులోని సమీర్ 114 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని జూడాల వినతి

నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లను నెరవేర్చాలని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం అసోసియేషన్ నేత, డాక్టర్ జునైద్ అలీఅహ్మద్ మాట్లాడారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రి ఆవరణ, వరండాల్లో తగినంత వెలుతురు ఉండేలా లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు పనిచేసే వార్డుల్లోనే వాష్, రెస్ట్ రూమ్‌లు ఉండేలా చూడాలన్నారు.

ఎన్నారైల లేఅవుట్లో టీడీపీ నేతల విధ్వంసకాండ

- ఆక్రమించుకునేందుకు యత్నం
- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమదంటూ దౌర్జన్యం
- కోర్టు తీర్పును జీర్ణించుకోలేక దమనకాండ



లేఅవుట్లోని రోడ్డును జేసీబీ సాయంతో తవ్విస్తున్న టీడీపీ నేత అనుచరులు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ నేతల అరాచకాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. సామాన్యులపై జులుం ప్రదర్శిస్తూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడుతున్నారు. తాజాగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముగ్గురు ఎన్నారైలకు సంబంధించిన ఆస్తిని ఆక్రమించుకునేందుకు యత్నించారు. ఎన్నారైలకు అనుకూలంగా కోర్టు తీర్పునివ్వడంతో జీర్ణించుకోలేక రూరల్ మండల టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి అనుచరులు బాధితురాలిని బెదిరించారు. అంతటితో ఆగకుండా లేఅవుట్లో విధ్వంసానికి శుక్రవారం పాల్పడ్డారు. దీనిపై ఎన్నారైల బంధువు మనుబోలు విజయలక్ష్మి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయలక్ష్మి వెల్లడించిన వివరాల మేరకు.. యూకేలో ఉంటున్న ముగ్గురు అన్నదమ్ములు ఉచ్చూరు అశోక్‌రెడ్డి, సాధనరెడ్డి, అనిల్‌ప్రేమ్ రెడ్డికి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నవలాకులతోటలో ఏడెకరాల భూమి ఉంది. వారు ఆ భూమిలో 89 ప్లాట్లతో లేఅవుట్ వేశారు. 48 ప్లాట్లను విక్రయించగా, 13 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. 2020లో రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, మసూద్ అనే వ్యక్తులు అశోక్‌రెడ్డి తల్లి ఉచ్చూరు కృపామయిరెడ్డి ఈ స్థలాన్ని తమకు రాసిచ్చారంటూ నకిలీ డాక్యుమెంట్లను సృష్టించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. అశోక్‌రెడ్డి అత్త మనుబోలు విజయలక్ష్మి కేసుల వ్యవహారాలను చూసుకుంటున్నారు. ఈ తరుణంలో అశోక్‌రెడ్డి తదితరులకు అనుకూలంగా ఈ నెల రెండున కోర్టు తీర్పునిచ్చింది. దీన్ని ఓర్వలేని టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి తన అనుచరులైన రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి రమేష్‌రెడ్డి, మసూద్‌తో దౌర్జన్యానికి దిగారు. వంద మందితో లేఅవుట్లోకి ప్రవేశించి వీరంగం సృష్టించారు. నిర్మాణంలో ఉన్న రెండు ప్రహరీలను జేసీబీలతో కూల్చేశారు. లేఅవుట్లోకి వెళ్లే మార్గంలో ఆరడుగులు గుంత తవ్వారు. ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్‌ను తొలగించి పక్కకు తోసేశారు. ప్లాట్ల కొనుగోలుదారులను భయభ్రాంతులకు గురిచేశారు.

ఎన్నారైల ఆస్తులకు రక్షణేదీ..?



ఎన్నారైల ఆస్తులకు రక్షణ లేదు. లేఅవుట్లో విధ్వంసం సృష్టించారు. స్థలాల యజమానులను భయభ్రాంతులకు గురిచేశారు. కూల్చివేతలకు పాల్పడ్డారు. పోలీసులు న్యాయం చేసి రక్షణ కల్పించాలి. మా వద్ద అన్ని పత్రాలు, కోర్టు ఉత్తర్వులున్నా, ఇలా వ్యవహరించడం అన్యాయం.

– మనుబోలు విజయలక్ష్మి



కూల్చివేతకు గురైన ప్రహరీ

జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ బదిలీ

నెల్లూరు(క్రైమ్): చెముడుగుంటలోని జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ రాజేశ్వరరావు కడప సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో నగరంలోని ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్ రాజారావును నియమించారు. కడప సెంట్రల్ జైల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రకాష్‌ను ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్‌గా నియమిస్తూ జైళ్ల శాఖ డీఐజీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్:	రూ.112
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.206
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.178

క్లుప్తంగా

బావిలో పడిన చుక్కల దుప్పి

- రక్షించిన అటవీశాఖ అధికారులు



మర్రిపాడు: దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన ఓ చుక్కల దుప్పి ప్రమాదవశాత్తూ బావిలో పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. దాహార్తిని తీర్చుకునేందుకు గానూ మండలంలోని పడమటినాయుడుపల్లిలో మాగాణి పొలాలకు నీటిని అందించే నిచ్చెన బావి వద్దకు వచ్చిన చుక్కల దుప్పి అందులో పడింది. పైకెక్కే మార్గం లేకపోవడంతో బావిలోనే ఈదసాగింది. గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు బావి వద్దకు చేరుకొని చుక్కల దుప్పిని రక్షించి అడవిలో వదిలేశారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొండాయపాళెం రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు కలిగి.. మెరూన్ రంగుపై బ్లూ చెక్స్ కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లూ రంగుపై తెలుపు చెక్స్ లుంగీని ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ఆవరణలో గల కుళాయి వద్ద నీరు తాగేందుకెళ్లి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి.. పాచి రంగు టీ షర్ట్, ముదురు సిమెంట్ రంగు లోయర్‌ను ధరించి ఉన్నారు. ఈ విషయమై చిన్నబజార్ పోలీసులకు డిపో సిబ్బంది సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కోరారు.

రోడ్లపై పశువులను వదిలితే చర్యలు



గోవులను వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

నెల్లూరు(బారకాసు): ప్రధాన రహదారులపై వాహనదారులకు ఇబ్బందిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ హెచ్చరించారు. మద్రాస్ బస్టాండ్, కోటమిట్ట, నారాయణ మెడికల్ కళాశాల ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న 14 గోవులను కల్లూరుపల్లిలోని గోశాలకు శుక్రవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లపై సంచరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న గోవులను గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యతను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుందని చెప్పారు.

బస్సు టైర్ కింద నలిగిన కాలు

అనుమసముద్రంపేట: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కింద వృద్ధుడి కాలు నలిగిన ఘటన ఏఎస్‌పేటలోని బస్టాండ్ సెంటర్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏఎస్‌పేటలోని దర్గాకు వైఎస్సార్ జిల్లాకు చెందిన వృద్ధుడు వచ్చారు. మద్యాన్ని కొంత సేవించి బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై కూర్చున్నారు. ఈ క్రమంలో కాళ్లు చాపుకొని ఉండగా, సాయంత్రం 6.30 సమయంలో కాలును తొక్కుకుంటూ బస్సు వెళ్లింది. దీంతో బాధితుడి కాలు నుజ్జు నుజ్జయింది. స్థానికులు కేకలేస్తున్నా, ఆగకుండా బస్సు వెళ్లిపోయింది. దీంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. అనంతరం 108లో ఆత్మకూరు తరలించారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని నగరంలోని కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. డీఆర్వో లవన్న, ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో తనిఖీలను ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి కళారాణి, డాక్టర్లు మస్తాన్‌బాషా, నరేంద్ర శుక్రవారం చేపట్టారు. పాత, నూతన భవనాలను పరిశీలించారు. రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయనే అంశాన్ని ఆరాతీశారు. ఆహారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కళారాణి మాట్లాడారు. ఆస్పత్రిలో డాక్టర్ల రక్షణకు అవసరమైన గదులను గుర్తిస్తున్నామని చెప్పారు. సీసీ కెమెరాలు ఇంకా ఎక్కడెక్కడ అవసరమో పరిశీలించి దానికి అనుగుణంగా చర్యలు చేపడతామని వివరించారు. బయటి వ్యక్తులు ఆస్పత్రిలో సంచరించకుండా సెక్యూర్టీ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

బాలిక అదృశ్యం

సంగం: బాలిక అదృశ్యమైన ఘటనపై సంగం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అన్నారెడ్డిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన భవానీ కుమార్తె కూలీ పనులు చేస్తూ ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో నెల్లూరులో ఉన్న కుటుంబసభ్యులకు రాఖీ కట్టేందుకు భవానీ, ఆమె కుమార్తె ఇటీవల వెళ్లారు. గ్రామంలోని తన స్నేహితురాలి వద్ద దండ తెచ్చుకుంటానని చెప్పి వెళ్లి ఆపై అదృశ్యమైంది. అన్నారెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినా, ప్రయోజనం లేకపోవడంతో తల్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.